## క్లుప్తంగా

### నూతన కార్యవర్గం ఎన్నిక

రాజాం: మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఆదివారం నిర్వహించారు. సమాఖ్య మండల అధ్యక్షురాలిగా సామంతుల అరుణకుమారి, ఉపాధ్యక్షురాలిగా పొగిరి వెంకటరమణమ్మ, కార్యదర్శిగా ఎ.గౌరీశ్వరి, సహాయకార్యదర్శిగా ఎ.మంగమ్మ, కోశాధికారిగా ఎ.రమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వైకేపీ ఏసీ ఎ.చిరంజీవి తెలిపారు. అనంతరం కొత్తగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మండలంలోని మహిళా సంఘాల సంఖ్యను పెంచేందుకు కృషిచేస్తామని, ఆర్థిక అక్షరాస్యత పెంచుతామని కొత్త కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, ఏపీఎం దధికుమార్, ఎఫ్‌పీవో ఏపీఎం కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా మునిస్వామి

తెర్లాం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల అధ్యక్షుడిగా గర్భాపు మునిస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా చిప్పాడ రమణ, సహాధ్యక్షుడిగా బి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా శంకరరావు, కోశాధికారిగా రాంబాబు ఎన్నికయ్యారు.

### పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం కలుగుతుందని, ప్రతీ విద్యార్థి ప్రాథమిక దశ నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని, పుస్తక పఠనంపై అందరూ ఆసక్తి కలిగి ఉండాలన్నారు. రోజుకో పుస్తకం చదివితే కొత్త కొత్త విషయాలు తెలుస్తాయన్నారు.

### పంటకోత ప్రయోగం



వరికోత యంత్రం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఏవో రేణుకాసాయి

రాజాం: వరి పంట నూర్పిడి, కోతల సమయంలో కూలీల కొరత నివారించుకునేందుకు అధునాతన యంత్రాలు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎ.రేణుకాసాయి కోరారు. ఆదివారం మండలంలోని ఆగూరు, కంచరాం, పొగిరి, లక్ష్మీపురం, శ్యాంపురం తదితర గ్రామాల్లో పర్యటించిన ఆమె అక్కడి వరి పంటపొలాలు పరిశీలించి, పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఆశించిన స్థాయిలో ధాన్యం దిగుబడి వస్తున్నట్లు రైతులు తెలిపారు. అనంతరం మార్కెట్‌లోకి వచ్చిన కొతరకం వరికోత యంత్రాలపై అవగాహన కల్పించారు.

### జీవామృతంతో చీడపీడల నివారణ

రేగిడి: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసే జీవామృతం(ఎరువు)తో పంటకు పట్టే చీడపీడలను నివారించవచ్చని ఏవో మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని, ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంటలతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కె.రమణ, ఆర్.సింహాచలం జీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. 5 లీటర్ల ఆవుమూత్రం, 5 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల నీరు, 150 గ్రాముల సున్నంను ఓ డబ్బాలో వేసి, మూటకట్టి కర్రకు చుట్టిన 5 కిలోల ఆవుపేడను 12 గంటల పాటు ఆ నీటిలో ఉంచితే జీవామృతం తయారవుతుందన్నారు. దీన్ని మినప, పెసర, మిరప తదితర పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలు, తెగుళ్లు సోకకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

రాజాం: స్థానిక పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న బావిరేవతమ్మ ఆలయ నిర్మాణానికి రాజాం పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ రూ.10,116లను ఆర్థికసాయంగా అందజేశారు. ఆయన ఈ నగదును స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదాం



రాజాం: మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగ విశిష్టతను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



వంగర: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ తదితరులు



తెర్లాం: శాఖా గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి



రేగిడి: దేవుదళ కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌వో లక్ష్మి, విద్యార్థులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో భారత రాజ్యాంగ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. సమసమాజ స్థాపనే లక్ష్యంగా దేశంలోని అన్నివర్గాల ప్రజలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తూ మనకు మనంగా రూపొందించుకున్న రాజ్యాంగాన్ని భారత రాజ్యాంగ సభ ఆమోదించిన ఇదే రోజున ఏటా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. రాజ్యాంగమే దేశానికి మూలస్తంభమని, రాజ్యాంగాన్ని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న అంబేద్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య



బొబ్బిలి: అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బాడంగి: మానవహారంగా ఏర్పడి, రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు



రామభద్రపురం: తారాపురంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీటీసీ సునీత



రాజాం సిటీ: పాలకొండ జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



బాడంగి: శాఖా గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ దుర్గాప్రసాద్, తదితరులు



రాజాం: కంచరాంలో జరిగిన కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ సభ్యులు

# విద్యార్థుల్లో నైతికవిలువలు పెంపొందించాలి



విజేతలతో వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని వికాస తరంగిణి కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.టి.వి రమణమూర్తి సూచించారు. స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో రామాయణంలోని బాలకాండలో ఉన్న 30వ సర్గ 16వ శ్లోకంలోని సన్నివేశాలపై చిత్రలేఖనం పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రామాయణంపై అవగాహన కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాముడు ఆదర్శప్రాయుడని, సత్యాన్ని, ధర్మాన్ని తప్పకుండా ఏ విధంగా మనిషి జీవించాలో మనకు తెలియజేశారన్నారు. ప్రతిఒక్కరూ సద్గుణాలను అలవర్చుకుని, సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీలో ఉట్ల ప్రసన్న (జెడ్పీహెచ్ఎస్, కంచరాం), మొగదాల సోనియా(జెడ్పీహెచ్ఎస్, కంచరాం), లోచర్ల గణేష్(ఉన్నత పాఠశాల, రాజాం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి, బహుమతులు కైవసం చేసుకోగా, జూనియర్స్ విభాగంలో లోతుపల్లి ఉదయ్‌కుమార్(జెడ్పీహెచ్ఎస్, హొంజరాం), కె.ఢిల్లీశ్వరరావు(జెడ్పీహెచ్ఎస్, బొద్దూరు), కె.నిరీష (జెడ్పీహెచ్ఎస్, డోలపేట)లు తొలి మూడు స్థానాల్లో నిలిచి, బహుమతులు దక్కించుకున్నారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి, సీనియర్స్ విభాగంలో బొండపల్లి సిరిజాహ్నవి(సన్ స్కూల్), దుప్పలపూడి ధనసాయి (సన్ స్కూల్), మెరుగు సుమిత్ర (సన్‌స్కూల్)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. జూనియర్స్ విభాగంలో దార వేదవర్షిత (సన్ స్కూల్), మెరుగుల వెంకటేష్ (సన్ స్కూల్), మానం హర్షిణిప్రియ (జ్ఞానజ్యోతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు పైడిరాజు, నీలకంఠం, అప్పలనాయుడు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన జీవితం ఆదర్శవంతమైనది..

రాజాం సిటీ: ఆదివాసీ, మైదాన సంస్కృతులు రెండూ భిన్నమైనవని, నేటి కాలంలో మైదాన సంస్కృతి.. ఆదివాసీ సంస్కృతిని నాశనం చేస్తోందని డాక్టర్ ఆల్తి మోహనరావు అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక(రారవే) 106వ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'మల్లిపురం జగదీష్ కథలు–గిరిజన జీవనం' అనే అంశంపై ప్రసంగించారు. గిరిజన జీవితం ఆదర్శవంతమైనదని, వారిలో పరువు హత్యలు, దొంగతనాలు ఉండవని, పశువుల పాలు దూడలకే వదిలేస్తారని, వారి సంస్కృతి చాలా గొప్పదన్నారు. వారి సంస్కృతీ, సంప్రదాయాలను మల్లిపురం జగదీష్ కళ్లకుకట్టినట్లు తన కథల ద్వారా వివరించారన్నారు. రచయిత స్వతహాగా గిరిజనుడు కావడంతో అంత సహజంగా గిరిజనుల జీవనాన్ని రాయగలిగాడన్నారు. జగదీష్ రాసిన సిలకోల, గురి అనే రెండు కథాసంకలనాలను తీసుకువచ్చారని, ఇవన్నీ గిరిజనుల జీవితాలకు అద్దం పడతాయన్నారు. సమావేశంలో రారవే సభ్యులు గార రంగనాథం, తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుడికి గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన వృద్ధుడు ముంజేటి రాజారావు గాయపడ్డాడు. ఆదివారం వేకువజామున రాజారావు బహిర్భూమికి వెళ్లేందుకు సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపక్క తుప్పల్లో పడిపోయాడు. ఉదయం అటుగా వెళ్లినవారు చూసి రాజాం సామాజిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్సనందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు.

**ఆటో బోల్తాపడి ముగ్గురికి..**

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని వస్త్రపురికాలనీ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలయ్యాయని ఎస్సై పి.నీలావతి తెలిపారు. కంచరాం గ్రామం నుంచి రాజాం వస్తున్న ఆటో మితిమీరిన వేగంతో వచ్చి అదుపు తప్పి బోల్తాపడిందన్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కోండ్రు రామలక్ష్మి, బండి అప్పలరాజు, వాస నందకుమార్‌లు స్వల్పగాయాలపాలయ్యారని, వారిని స్థానికులు రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో కార్తీకపౌర్ణమి పూజలు



రామభద్రపురంలో ఉమారామలింగేశ్వరస్వామి విగ్రహ ఊరేగింపు నిర్వహిస్తున్న శివుని భక్తులు

వాడవాడలా కార్తీకపౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. మహిళలు తలంటు స్నానం చేసి, లక్ష్మీదేవికి పూజలు చేసి, ప్రత్యేక నోములు నోచారు. మరికొన్నిచోట్ల దీపారాధనలు చేపట్టారు. మరికొంతమంది దగ్గరలోని శివాలయాలకు వెళ్లి, విశేష పూజలు చేశారు. అన్నిచోట్ల జరిగిన ఈ కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



బాడంగి: భీమవరం వద్ద వేగావతి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



రాజాం: మల్లిఖార్జునస్వామి ఆలయంలో దీపారాధన



వంగర: సంగాంలో సంగమేశ్వరస్వామి సన్నిధిలో కార్తీక దీపారాధన



బొబ్బిలి: భక్తుల దీపారాధన

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రేగిడి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ఆదివారం అవగాహన కల్పించారు. ఎంతోమంది మద్యం, గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, పొగాకు వంటి మత్తు పదార్థాలకు బానిసలై, జీవితం నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మాదకద్రవ్యాలు(గంజాయి, కొకైన్, హెరాయిన్..) అమ్మడం, కొనడం రెండూ నేరమేనని, వాటిని విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# పల్లెల పరిశుభ్రతతో ప్రజారోగ్యం



వంగర: చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు సుదర్శనరావు

వంగర: పల్లెలు పరిశుభ్రంగా ఉంచగలిగితే ప్రజలు ఆరోగ్యంగా ఉండగలుగుతారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ఎంపీటీసీ కరణం సుదర్శనరావు అన్నారు. మండలంలోని శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీలో చెత్తసేకరణ బుట్టల పంపిణీ ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని, ఇప్పటికే ప్రతీ గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లను నియమించి, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తోందన్నారు. ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా ఈ బుట్టలలో తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా వేసి, గ్రీన్‌అంబాసిడర్లకు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శనపతి సత్యారావు, రాష్ట్ర సాహితీ అకాడమీ డైరెక్టర్ బొంతు వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి జీవన్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వన్నలి, అంబకండి, ఉనుకూరు, చిన్నశిర్లాం, బూరాడ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఆదివారం చేపట్టారు. వీధులు, కాలువల్లోని చెత్తాచెదారం తీసివేసి, డంపింగ్‌యార్డుకు తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గార రమణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని పక్కి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు చేతులమీదుగా గ్రామస్తులకు చెత్తబుట్టలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ బుట్టలలో తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా వేసి, ఇంటి వద్దకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్‌కు ఇచ్చి, పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.